ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 13 ఆగస్టు 2024



చిలకపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఎచ్చెర్ల, ఆగస్టు 12: ఎచ్చెర్ల మండలం చిలకపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.అప్పలరాజును సస్పెన్షన్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల కిందట కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆ సమయంలో పారిశుధ్య పరిస్థితులు బాగోలేవని పంచాయతీ కార్యదర్శి అప్పలరాజుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. అలాగే ఈవోపీఆర్డీ దేవీకి షోకాజు నోటీసు ఇచ్చారని తెలిపారు.

ఆ 25 కిలోమీటర్లు..

- డేంజర్ జోన్‌లో నదీ తీరం
- కేంద్ర భూ భౌతిక విజ్ఞాన శాఖ వెల్లడి
- మానవ తప్పిదాలే కారణం
- చెట్ల నరికివేత, జలాలు కలుషితం వల్లే..



రణస్థలంలో కోతకు గురైన తీరం

(రణస్థలం)

బంగాళాఖాతం తీరప్రాంతం గణనీయంగా కోతకు గురవుతోంది. రాష్ట్రంలో విస్తరించి ఉన్న 973 కిలోమీటర్ల తీర ప్రాంతంలో దాదాపు 28.7శాతం భూభాగం కోతకు గురైనట్టు కేంద్ర భూ భౌతిక విజ్ఞాన శాఖ మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది. జిల్లాకు సంబంధించి 25.12 కిలోమీటర్ల తీర ప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్టు స్పష్టం చేసింది. ఉష్ణ మండల తుఫాన్లు, రుతుపవనాల సీజన్‌లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, పోర్టులు, హార్బర్ల నిర్మాణం, చెట్లు నరికివేత, పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితం కావడం వంటి కారణాలతో తీర ప్రాంతానికి ముప్పు వాటిల్లుతోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

కోతతో పంటలకు నష్టం..

జిల్లాలో 11 మండలాల్లో తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం నుంచి సంతబొమ్మాళి మండలం వరకూ తీరం కోతతో జీడి, మామిడి, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లుతోంది. తీరం అంచున 100 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆటు పోట్ల సమయంలో కొన్ని గ్రామాల్లోకి ఉప్పు నీరు ప్రవేశిస్తుంటుంది. ఆ సమయంలో మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురవు తారు. బాహుదా నది కలిసే ఇచ్ఛా పురం మండలం డొంకూరు, మహేంద్ర తనయా నది కలిసే సోంపేట మండలం బారువ, వంశధార నది కలిసే గార మండలం కళింగపట్నం, నాగావళి నది కలిసే శ్రీకాకుళం మండలం కళ్లేపల్లి వద్ద సముద్రపు నీరు తిరిగి పోటెత్తుతుంది. ఆ సమయంలో సముద్ర తీరం కోతకు గురవుతుంటుంది. ఉప్పునీరు పోటెత్తి శ్రీకాకుళం, పోలాకి, గార మండలాల్లో సాధారణ పంటలకు నష్టం వాటిల్లుతుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్లు తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో వందలాది మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలో బాహుదా, మహేంద్ర తనయా, వంశధార, నాగావళి నదులు సముద్రంలో కలుస్తున్నాయి. నదుల సంగమం వద్ద ఏటా వరదలు పోటెత్తుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం లేకపోవడం, నీటి స్థిరీకరణకు అవకాశం లేకపోవడం, కరకట్టల నిర్మాణం చేపట్టకపోవడంతో నీటి ప్రవాహ గమనం పెరిగి ఒకేసారి సముద్రంలోకి నీరు పోటెత్తుతోంది. అదే సమయంలో సముద్రం ఉగ్రరూపం దాల్చుతుండడంతో తీరం కోతకు గురవుతోందని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ఎక్కువగా సముద్రంలో నదులు కలిసే ప్రాంతంలో తీరం కోతకు గురవుతోంది. శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, పోలాకి, సోంపేట, మందస, ఇచ్ఛాపురం, కవిటి తీరంలోనే కోత అధికంగా కనిపిస్తోంది. 193 కిలోమీటర్ల పాటు విస్తరించి ఉన్న తీరంలో.. ఈ మండలాల్లోనే 25కిలోమీటర్లు తీరం కోతకు గురైనట్టు తెలుస్తోంది.



తీరంలో ఎండిన సరుగుడు మొక్కలు (ఫైల్)

చెట్లు నరికివేత..

జిల్లాలో తీరం పొడవునా సరుగుడు, నీలగిరి తోటలు విస్తారంగా ఉండేవి. కానీ ఈ చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. చెట్ల సాగు కూడా గణనీయంగా తగ్గింది. టెక్కలి డివిజన్‌లో తీరంలో కొబ్బరి, జీడి సాగు అధికంగా ఉంది. కానీ ఏటా విపత్తులతో వేలాది జీడి, కొబ్బరి మొక్కలు నేలవారుతున్నాయి. ముఖ్యంగా హుద్‌హుద్, తితలీ తుఫాన్‌తో దాదాపు తీరంలో జీడి, కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. దీంతో తీరం పటుత్వం తగ్గింది. కోతకు ఇదే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

నదులు కూడా కారణం..

వంశధార, నాగావళి తదితర నదులు ఒడిశాలో పుట్టి మన జిల్లా మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తున్నాయి. నదులు దారిపొడవునా ఉన్న కాలుష్యాన్ని వ్యర్థాలను తమ వెంట తెచ్చుకుంటున్నాయి. ప్రధానంగా నాగావళి నది.. సముద్రంలో కలిసే కళ్లేపల్లి వద్ద పరిస్థితి దయనీయంగా ఉంది. శ్రీకాకుళం నగరంలోని కలుషితాలు, వ్యర్థాలు నదిలో కలిసిపోతున్నాయి. అవే నీరు సముద్రంలో కలుస్తుండడంతో కాలుష్యభరితంగా మారుతున్నాయి. అటు నదుల్లో ఇసుక తవ్వకాలు పెరుగుతుండడంతో నీటి ప్రవాహ గమనం మారుతోంది. వరదల సమయంలో నీరు ఒకేసారి పోటెత్తడంతో ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. ఇవి కూడా తీరం కోతకు ప్రధాన కారకాలుగా మారుతున్నాయి.

చెట్లు విరివిగా పెంచాలి

జిల్లాలో తీర ప్రాంతంలో సరుగుడు, నీలగిరి తోటలు ఉండేవి. ఇవి తీరం కోతకు గురికాకుండా రక్షణ కవచంలా నిలిచేవి. కానీ ఇవి నరికివేతకు గురవుతున్నాయి. ఇదే ప్రమాదానికి కారణం. తీరానికి సీఆర్‌జెడ్ పరిధి 500 మీటర్ల వరకూ ఉంటుంది. ఇక్కడ చెట్లు పెంచితే అలల ఉధృతి తగ్గుముఖం పడుతుంది. వృక్షాల వేర్లు తీరానికి బలమైన అండగా నిలుస్తాయి. నదులు సముద్రంలో కలి సే చోట ఎటువంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. తీరం వెంట రాతికట్టడాలు ఉంటే మరింత శ్రేయస్కరం.

\- దన్నాన స్వామినాయుడు, భూవిజ్ఞాన శాస్త్రవేత్త, రణస్థలం

కాలుష్యం పెరిగిపోయింది

సముద్ర జలాల్లో విపరీతమైన వ్యర్థాలు కలుస్తున్నాయి. రసాయనిక పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి పైపులైన్ల ద్వారా విడిచిపెడుతున్నారు. జీరో కాలుష్యంగా మార్చి వ్యర్థాలను విడిచిపెట్టాలి. కానీ అలా జరగడం లేదు. అందుకే సముద్రం ఉగ్రరూపం దాల్చుతోంది. మత్స్యసంపద నశిస్తోంది. సముద్రం ఇసుకను అక్రమంగా తరలించడం కూడా కోతకు గురికావడానికి ప్రధాన కారణం.

\- కూన రామం, సంజీవినీ పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

- దుష్ప్రభావాలపై యువతకు అవగాహన తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 12: 'మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి. యువత వాటి బారిన పడకుండా చర్యలు చేపట్టాలి. దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'నషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. 'దేశ ప్రగతిని ముందుకు తీసుకువెళ్లాల్సింది విద్యార్థినీ, విద్యార్థులే. వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. ఒక్కసారి ఎన్‌పీడీఎస్ యాక్టులో పేరు నమోదైతే సమాజంలో ఉనికిని కోల్పోతారు. మాదకద్రవ్యాల వినియోగం వలన అనారోగ్యాలు తలెత్తుతాయి. మాదకద్రవ్యాలను అరికట్టేందేకు ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వహించాలి' అని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ తదితరులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐఓ దుర్గాప్రసాద్, డీవీఈవో తవిటినాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్ సత్యనారాయణ, ఎన్‌సీసీ పోలినాయుడు, డీఎఫ్‌వో ప్రతినిధి నాగేంద్రరావు, నారాయణ, శ్రీ చైతన్య, తిరుమల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ, ఎమ్మెల్యే తదితరులు

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు పరిశీలన

కలెక్టరేట్: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం చేయాలన్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎస్పీ శేషాద్రినాయుడు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, శ్రీకాకుళం తహసీల్దారు గణపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భూ ఆక్రమణకు చెక్

- గత ప్రభుత్వ హయాంలో కబ్జాలపై దృష్టి
- ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు
- ఈ నెల 15న లాంఛనంగా ప్రారంభం
- 16 నుంచి గ్రామాల వారీగా వినతుల స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి చర్యలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

భూ ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు భూ ఆక్రమణలు భారీగా చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ స్థలం.. జిరాయితీ.. నదీ తీరం.. కొండప్రాంతాలు.. ఇలా పలుచోట్ల ఆక్రమణలు అడ్డూ అదుపూ లేకుండా సాగిపోయాయి. ఇటువంటివన్నీ బయట పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. బాధితుల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఈ నెల 15న లాంఛనంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభించనుంది. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకూ.. షెడ్యూల్ ప్రకారం 45 రోజులపాటు జిల్లావ్యాప్తంగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. వినతులు స్వీకరిస్తారు. వాటిని నవంబరు 15వ తేదీలోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

- రెవెన్యూ సదస్సుల్లో గ్రామసభలు ద్వారా వచ్చిన వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. ప్రతిరోజూ రాష్ట్ర ఉన్నతాధికారులకు జిల్లా నుంచి నివేదిక పంపాలి. అర్జీదారునికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాల్సిందే. నవంబరు ఒకటో తేదీ నుంచి సమస్యలపై తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పర్యటించి.. భూ ఆక్రమణలు.. ఇతరత్రా రెవెన్యూ సమస్యలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయాలి. గ్రామసభలో అంతా తెలుగుభాషలోనే మాట్లాడాలి. వినతులు కూడా తెలుగులోనే స్వీకరించాలి. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు రెవెన్యూ విలేజ్‌లో సదస్సు ప్రారంభం కావాలి. జిల్లావ్యాప్తంగా సదస్సుల నిర్వహణకు రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకూ కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

అధికారుల బృందం వీరే..

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయ శాఖ అధికారి, రిజిస్ట్రేషన్ అధికారి, అటవీశాఖ అధికారి పాల్గొనాలి. వీళ్లందరినీ డిప్యూటీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. అప్పుడప్పుడు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపడతారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ముందుగానే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి.. గ్రామాల్లో సైతం ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలి. కాగా.. గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమాలపై అధికసంఖ్యలో వినతులు ఇచ్చేందుకు బాధితులు సిద్ధంగా ఉన్నారు.

పలాసలో బాలుడి కిడ్నాప్

- ఇద్దరు మిలటరీ జవానులతో సహా నలుగురి అరెస్ట్
- అర్ధరాత్రి దాడుల్లో దొరికిన బాలుడు, కిడ్నాపర్లు



విశ్వజిత్

పలాస, ఆగస్టు 12: పలాస-కాశీబుగ్గలో బాలుడి కిడ్నాప్ కలకలం రేగింది. ఈ ఘటనలో నలుగురు అరెస్టు కాగా.. అందులో ఇద్దరు మిలటరీ జవానులు కూడా పోలీసులకు పట్టుబడడం చర్చనీయాంశమైంది. బాలుడు సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన కె.విశ్వజిత్ అనే 13 ఏళ్ల బాలుడు ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబీకులు బాలుడి ఫొటో, వివరాలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కాగా.. కాశీబుగ్గ ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో ఈ బాలుడిని మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొత్తం నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు తెలియడంతో పోలీసులు అప్రమత్తమై.. వారిని పట్టుకున్నారు.

బెడిసికొట్టిన వ్యూహం..

ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న బత్తిన నాగరాజు, ఆయన సోదరుడు బత్తిన లక్ష్మణరావు, మరో ఆర్మీ ఉద్యోగి ఉణుకూరు గుణశేఖర్(చిత్తూరు జిల్లా), రేపల్లె పృథ్వీలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఆర్మీ ఉద్యో గులిద్దరూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనడంతో అక్రమంగా డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. ఈ విషయం స్నేహితుడు పృథ్వీకి చెప్పగా.. లక్ష్మణరావుతో కలిసి మొత్తం నలుగురు బృందంగా ఏర్పడ్డారు. పృథ్వీ ఇంటి పొరుగునే ఉన్న 8వ తరగతి చదువుతున్న కె.విశ్వజిత్‌ను కిడ్నాప్ చేసి ఆయన తండ్రి నుంచి డబ్బులు గుంజాలని పథకం వేశారు. ఆదివారం విశ్వజిత్ ఇంటి నుంచి బయటకు రాగా పృథ్వీ తన వాహనంపై ఆ బాలుడ్ని ఎక్కించుకుని నమ్మబలికి కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో కిడ్నాపర్ల మధ్య చిన్న ఘర్షణ జరగడం, బాలుడి వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో తామంతా దొరికిపోతామని భావించారు. కాశీబుగ్గలో ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో ఓ చీకటి ప్రదేశంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఆ బాలుడిని విడిచిపెట్టి పరారీ అయ్యారు. అదే సమయంలో రాత్రి గస్తీలో ఉన్న డీఎస్పీ శ్రీనివాసరావు వారి కదలికలపై అనుమానం వచ్చి పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో వారంతా పోలీసులకు చిక్కిపోయారు. అనంతరం జరిగిన విషయం వారికి తెలియజేశారు. బాలుడ్ని సురక్షితంగా వారి ఇంటికి చేర్చి ఇద్దరు ఆర్మీ జవానులతో పాటు మరో ఇద్దరిపై కిడ్నాప్‌పై కాశీబుగ్గ పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ విజయానంద్ తెలిపారు.

ఎర్రకోటపై స్వాతంత్ర్య వేడుకలకు..
నిమ్మాడ రైతులకు ఆహ్వానం

కోటబొమ్మాళి, ఆగస్టు 12: న్యూఢిల్లీలోని ఎర్రకోటపై ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు.. కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన రైతులు దోమ మోహనరావు, పుణ్యవతి దంపతులకు ఆహ్వానం అందింది. మోహనరావు దంపతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించి.. యాంత్రీకరణ విధానం ద్వారా అధిక దిగుబడి సాధించారు. బిందుసేద్యం ద్వారా మెట్టు పంటలు పండించి ఉత్తమ రైతుగా గుర్తింపు పొందారు. సాగులో ఈ దంపతుల ప్రతిభను గుర్తిస్తూ.. పీఎం కిసాన్ పథకం కింద వారిద్దరినీ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపిక చేసినట్టు స్థానిక వ్యవసాయాధికారి సువ్వారి గోవిందరావు తెలిపారు. వీరి ఎంపికపై జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, గోవిందరావుతోపాటు పలు రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా.. రానున్న రోజుల్లో ఎరువులు, రసాయనాలు లేకుండా ఆర్గానిక్ పంటలు పండించేలా దృష్టి సారిస్తున్నానని రైతు మోహనరావు తెలిపారు. సఫలీకృతమైతే జిల్లావ్యాప్తంగా ఈ విధానంపై ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు.



మోహనరావు, పుణ్యవతి

విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆస్పత్రుల్లో రోగులు కిటకిట
- సక్రమంగా అందని వైద్యసేవలు

(ఇచ్ఛాపురం)

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించాయి. జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరంతో చాలామంది బాధపడుతున్నారు. ప్రతిఇంటా ఇద్దరు ముగ్గురు చొప్పున బాధితులు ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. కాగా.. గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నా.. వైద్యులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇచ్ఛాపురం మండలం కొళిగాం, ఈదుపురం పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

సీహెచ్‌సీలో ఇద్దరే వైద్యులు..

ఇచ్ఛాపురం సీహెచ్‌సీ.. పేరుకే పెద్దాసుపత్రి. ఇక్కడ వైద్యులు, సిబ్బంది అరకొరగా ఉండడంతో రోగులకు సేవలు సక్రమంగా అందడం లేదు. సీహెచ్‌సీకి రోజూ సుమారు 300 మంది ఔట్‌పేషెంట్లు, 30 మంది వరకూ ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. కాగా.. ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నారు. రోగులు గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది. వైద్యులను పూర్తిస్థాయిలో నియమించి.. సక్రమంగా సేవలు అందేలా చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

- ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా.. ఎక్కడికక్కడ నీరు నిలిచి.. దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల బెడద ఉండడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాల్సి ఉంది.



సీహెచ్‌సీలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు



తేలుకుంచిలో రోడ్డుపైనే మురుగునీరు

దిక్సూచి DIKSUCHI

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీ సీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీబీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించినసీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- ★ **తరతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- ★ **వెబ్‌సైట్:** www.ctuap.ac.in



ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/to0Hw17లో చదవండి.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్ర ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

నవ్య | చిత్రజ్యోతి

అది నా దురదృష్టం



మహేశ్‌బాబు, సోనాలి బింద్రే జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'మురారి'. ఇటీవలే ఆ సినిమా రీ రిలీజై క్రేజీ కలెక్షన్లు సాధిస్తున్న తరుణంలో దర్శకుడు సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. వారితో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఆయనకు కథ కూడా చెప్పాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఆయనతో సినిమా చేసి ఉంటే.. అది పెద్ద హిట్టయ్యేది. ఈ విషయంలో నాది దురదృష్టం అనుకోవాలి" అని పేర్కొన్నారు. అలాగే, మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ హీరోగా 'మురారి' సీక్వెల్ ఉంటుందా అని అభిమానులు ఆయన్ని అడిగారు. "ఆ సీక్వెల్ విషయం గౌతమ్ తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని కృష్ణవంశీ బదులిచ్చారు.

లేటెస్ట్ అప్‌డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌బీకే 109కి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. బాబీ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ సినిమా కోసం తీస్తున్న కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనీ సోమవారం సోషల్ మీడియా ద్వారా దర్శకుడు బాబీ వెల్లడించారు. 'బాలకృష్ణ ఎనర్జీనీ, అద్భుతమైన అభినయాన్ని ఈ సినిమాలో చూస్తారు. థియేటర్లలో ఆ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టైటిల్ గురించి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే టైటిల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు దర్శకుడు బాబీ. త్వరలోనే టైటిల్, టీజర్ విడుదలవుతాయని వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు.

ఏడ్చుకుంటూ ఇంటికి...



వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను ఆమె గుర్తుచేసుకున్నారు. "నటిగా నాకు మొదట్లో అవకాశాలు అంత సులువుగా వచ్చేవి కావు. ఆడిషన్లకు హాజరు కావడం.. అందులో సెలక్ట్ కాలేదని తెలిసి ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. ఓ సినిమాలో నటిగా అవకాశం రావడంతో ఎగిరి గంతేశా. కానీ ఆ ప్రాజెక్ట్ కొన్నాళ్లకే ఆగిపోయింది. ఆ తర్వాత కూడా నాకు అవకాశాలు వెంట వెంటనే ఏమీ రాలేదు. దాదాపు పాతిక ఆడిషన్లలో తిరస్కరణకు గురయ్యాను. అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేదాన్ని" అని చెప్పారు.

జాతి కోసం సాహస పోరాటం



తమిళ హీరో సూర్య నటిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ' అక్టోబర్ 10న విడుదల కానుంది. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో రూపుదిద్దుకుంటున్న 'కంగువ' ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. తన జాతి కోసం, తనవారి కోసం సాహసేపేతమైన పోరాటాలు చేసే ధీరుడిగా సూర్య పాత్ర ఉంది. భారీ నౌకలపై దాడి చేసే సన్నివేశాలు, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణలు నిలుస్తాయి. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో చిత్రం 'కంగువ' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


బట్టతలలా కనిపించాలి అంటే సరే అన్నా



'విజయవాడ రావడం చాలా హ్యాపీగా ఉంది. డైట్‌ను పక్కన పెట్టి 'బాబాయ్ హోటల్' లో ఇడ్లీలు తినేశా. నా 'అపరిచితుడు' సినిమా మిగిలిన ప్రాంతాలకంటే విజయవాడలోనే ఎక్కువ రోజులు ఆడింది. మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంత సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు' అన్నారు హీరో విక్రమ్. ఆయన నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'తంగలాన్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక మోహనన్, హాలీవుడ్ నటుడు డేనియల్, నిర్మాత ధనుంజయన్‌తో కలసి ప్రమోషన్స్ నిమిత్తం విజయవాడ వెళ్లిన విక్రమ్ మాట్లాడుతూ 'నేను విభిన్న పాత్రలు పోషించిన చిత్రాలన్నీ మీరు ఆదరించారు. ఈ సినిమాలోనూ కొత్తగా కనిపిస్తా. బట్టతలగా కనిపించే గెటప్‌లో కనిపించాలని దర్శకుడు పా.రంజిత్ చెప్పగానే సరేనన్నా. ఈ సినిమాలో రెగ్యులర్ ఫైట్లు, పాటలు ఉండవు. భావోద్వేగాలు బాగా ఉన్న కథ ఇది. 'తంగలాన్' మిమ్మల్ని సరికొత్త లోకంలోకి తీసుకెళుతుంది' అన్నారు.

గురువారం నాడే విడుదల

సినిమాలకూ.. శుక్రవారానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎన్నో ఆశలతో తెరకెక్కించిన సినిమాలను ఆ రోజున విడుదల చేసి బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు చిత్ర ప్రముఖులు. పండగ సీజన్లలో లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పించి శనివారం, గురువారం, బుధవారం వంటి ఇతర తేదీల్లో సినిమాలు విడుదలవ్వడం అరుదు. కానీ ఈ ఏడాది అనేక సినిమాలు శుక్రవారం ట్రెండ్‌ను బ్రేక్ చేసి.. గురువారాన్ని విడుదల తేదీగా మార్చుకున్నాయి.. ఆ చిత్రాలివే.









నాని నటించిన లేటెస్ట్ చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో విభిన్న కథాంశంతో తెరకెక్కిందీ చిత్రం. అధిక కోపం గల ఓ యువకుడు.. తన కోపాన్ని నియంత్రించుకోవడానికి ప్రతీ శనివారం ఏం చేశాడనేది ఈ సినిమా కథ. ఈ నెల 29న గురువారం విడుదవుతున్న ఈ చిత్రంలో నాని పాత్రలో అనేక రకాల షేడ్స్ ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇంతకు ముందు వీరి కలయికలో వచ్చిన 'అంటే సుందరానికీ' సినిమా..కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా.. విమర్శకుల ప్రశంసలను పొందింది.

డ్యూయల్ రోల్‌లో...

తమిళ కథానాయకుడు విజయ్ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షీ చౌదరి కథానాయిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5న గురువారం విడుదలవుతోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకి అధిక ప్రాధాన్యం ఉండనుంది.

వేటగాడిగా రజనీ..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా సందర్భంగా అక్టోబరు 10న గురువారం ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాస్ ఎంటర్టైనర్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాస్ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. సమాజంలో జరుగుతున్న ఓ కుంభకోణం నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో విశ్వక్ సరసన మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా అక్టోబరు 31న గురువారం విడుదల కానుంది.

బయోపిక్‌లో శివకార్తీకేయన్



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే తమిళ నటుడు శివ కార్తీకేయన్. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న బయోపిక్ 'అమరన్' వహిస్తున్నారు. ఈ సినిమా అమరులైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సాయిపల్లవి హీరోయన్‌గా నటిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31 గురువారం విడుదలవుతోంది.

'కల్కి' కూడా..

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం గురువారం రిలీజై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం (ఆగస్టు 15)న కూడా డజనుకు పైగా చిత్రాలు సందడి చేయనున్నాయి. గురువారం సెంటిమెంటు ఈ సినిమాలకు కలసి వస్తుందేమో చూడాలి.



ప్రేమ, వినోదం.. ఉత్సవం

దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగం.. అంశాలతో రూపుదిద్దుకొన్న కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకుడు అర్జున్ సాయి చెప్పారు. ప్రకాశ్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, ఆలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోందని నిర్మాత సురేశ్ పాటిల్ చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

ముఫాసా కోసం షారుఖ్



ప్రపంచ వ్యాప్తంగ ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన 'ముఫాసా ది లయన్ కింగ్' ఫ్రాంచైజ్‌లోని కొత్త సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా కోసం తొలిసారిగా బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ తన ఇద్దరు కుమారులతో కలసి డబ్బింగ్ చెబుతున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు షారుఖ్ గొంతు అరువిస్తుండగా, ఆర్యన్ ఖాన్ సింబా పాత్రకి, చిన్నప్పటి ముఫాసా పాత్రకు షారుఖ్ చిన్న కుమారుడు అబ్రమ్ ఖాన్ డబ్బింగ్ చెబుతున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తన దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన సాయి కిశోర్ దర్శకుడిగా మారి రూపొందించిన 'ధూమ్‌ధాం' చిత్రం టీజర్‌ను హీరో గోపీచంద్‌తో కలసి విడుదల చేశారు దర్శకుడు శ్రీను వైట్ల. గోపీ మోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్మెస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఉన్న మిత్రుల్లో హీరో గోపీచంద్ ఒకరు. చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దాం. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా నిర్మించాం. విదేశాల్లో కూడా షూటింగ్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

స్వాతంత్రం.. మా స్వాతంత్ర్యం



తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ ప్రారంభించిన లక్ష్మణ్ పూడి తన మాతృ సంస్థ ప్రజానాట్య మండలి రూపకల్పనలో ఎం. శేషగిరిరాసిన 'స్వాతంత్రం.. మా స్వాతంతీర్యం' పాటను పాడారు. శ్రీనివాస్ నందుల రాసిన ఈ పాటను తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దేశం మీద ప్రేమతో నిరక్షరాస్యులను మేల్కొల్పడానికి ఈ పాటను రూపొందించినట్లు లక్ష్మణ్ పూడి చెప్పారు.

సీనియర్ నటుడు నరేశ్ తన యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాకీ ష్రాఫ్, పూనమ్ థిల్లాన్, జయసుధ, సుహాసిని, కుష్బూ, సాయి దుర్గాతేజ్, మంచు మనోజ్, నారా రోహిత్ , దర్శకుడు మారుతి తదితరులు హాజరయ్యారు. హీరో కృష్ణ, విజయనిర్మలతో ఏర్పాటు చేసిన స్ఫూర్తి వనాన్ని ఈ సందర్భంగా నరేశ్ ప్రారంభించారు.



'అతడు' సినిమా చూసేవాడ్ని



'మహారాజా' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న ఆయన.. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన 'అతడు' సినిమా నాకెంతో ఇష్టం. జీవితంలో ఒడిదుడుకులకు లోనైన సమయాల్లో ఆ సినిమాను రిపీట్ మోడ్‌లో చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేశ్ నటన అద్భుతం. ఆయన పలికిన ప్రతీ డైలాగ్, సన్నివేశం నాకు బాగా గుర్తుండిపోతుంది. త్రివిక్రమ్ దర్శకత్వ పటిమ.. ఆయన రాసిన సన్నివేశాలతో తెరపై భావోద్వేగాలు బాగా పండాయి. ముఖ్యంగా హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ, బ్రహ్మానందం కామెడీ, పాటలు నాకు బాగా నచ్చాయి" అని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైతే సహించేదిలేదు

● రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైతే సహించేది లేదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2014-19 కాలంలో తాను మంత్రిగా టెక్కలిలో ప్రభుత్వ స్థలాలకు కాపలాదారుడిగా వ్యవహరించానని, అయితే వైసీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత మొత్తం స్థలాలన్నీ అన్యాక్రాంతం చేశారని విరుచుకుపడ్డారు. జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి ఎవరికి పట్టాలిచ్చారో, ఎవరు అమ్ముకున్నారో, ఎవరు ఇల్లు కట్టుకు న్నారో తెలి యని పరిస్థితి ఉందన్నారు. జగతిమెట్ట దగ్గర స్థలాలు నిజమైన పేదలకు ఇవ్వకుండా ఇష్టాను సారంగా అమ్మకాలు చేశారని, మండాపొలం కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, అంజనాపురం లేఅవుట్ ప్రాం తాల్లో పదవీ విరమణ చెందిన తహసీల్దార్ల పేరున, బదిలీ అయిన తహశీల్దార్ల పేరున ఇప్ప టికీ పట్టాలు పుట్టుకొస్తున్నాయని, వీటిపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. పాలకేంద్రం ఎదురుగా స్వర్ణ కారుల స్థలానికి సంబంధించి కొంతమంది పేపర్లు మార్చి అక్రమాలకు పాల్పడ్డారని, ఈ స్థలం ప్రభుత్వానిదని, ఈ స్థలంలో కొందరు లేఅవుట్లు వేశారని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లైనా న్యాయ పోరాటం చేసి ఈ స్థలం ప్రభుత్వానికి వచ్చేలా చేయాల న్నారు. అయ్యప్పనగర్‌లో కుల సంఘాలకు ఇచ్చిన స్థలాలు, టెక్కలి వెంకటేశ్వర కాలనీలో గోర్జిపోరంబోకు స్థలాలు కూడా ఆక్రమణలకు గురయ్యాయని, ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో గుర్తించాలని ఆదేశించారు. ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేద్కర్ పార్కు వరకు రోడ్డుకు ఇరు వైపులా ఆక్రమణలు తొలగించాలని, అవసర మైతే పంచాయతీ యంత్రాంగం పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పెండింగ్ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ పోలీస్, ఆర్అండ్‌బీ, పంచాయతీ యంత్రాంగాలు ఉమ్మ డిగా దృష్టిసారించా లని ఆర్డీవో బొమ్మాళి సుదర్శన్‌దొర, తహసీల్దార్లు దిలీప్‌చక్రవర్తి, అప్పల రాజులకు ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండలాల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, నేతలు మెండ దమయంతి, లవకుమార్, కామేసు, ప్రసాద్‌రెడ్డి, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

పాడైన రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయండి

కోటబొమ్మాళి: నియోజకవర్గంలో పాడైన రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆర్ అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. అక్టోబరు 1, 2, 3 తేదీల్లో జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల్లోగా కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు బీటీ రోడ్డు, కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి పాలేశ్వరస్వామి ఆలయం వరకు ఉన్న బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మిగిలిన రోడ్లను పరిశీలించి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సోమవారం కోటబొమ్మాళి ఎన్‌టీఆర్ భవనంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వెలుగు అధికారులతో మాట్లాడుతూ నందిగాం మండలం దీనబంధుపురంలో చోటు చేసుకున్న అక్రమాలపై దర్యాప్తుచేసి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లోను తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇంకా ఎక్కడైన ఎత్తిపోతల పథకాల నిర్వహణలో లోపాలున్నా, విద్యుత్ సమస్యలున్నా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

అంపలాం(పోలాకి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం అంపలాం ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం, నందిగాంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయుల సంఖ్య పెంచాల్సి ఉందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించిందన్నారు. అంపలాంలో తాగునీటి సమస్యపై గ్రామస్థులు ఎమ్మె ల్యే దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా న్నారు. సచివాలయానికి స్థలం ఇచ్చిన సదాశివుని చంద్రశేఖర్, వాటర్ ప్లాంట్‌కు సహకరించిన పొట్నూరు వర ప్రసాద్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జీల జగన్, ఎంపీ నాయుడు, రాంబాబు, నల్లాన వెంకు నాయుడు, సూరపునారాయణదాస్, హెచ్ఎం సదాశివుని శ్రీనివాస రావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, వెలమల కామేశ్వరరావు, దేవాది సింహాద్రమ్మ, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా ఇంట్లోకి మమ్మల్ని రానివ్వాలి

● టెక్కలి జడ్పీటీసీ వాణి డిమాండ్

● భర్త, ఎమ్మెల్సీ దువ్వాడ తీరుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్ష

టెక్కలి, ఆగస్టు 12: 'మా హక్కుల కోసం పోరాడుతున్నాం.. మా ఇంట్లోకి మమ్మల్ని రానివ్వాలి.. ఈ ఇంట్లోనే మేముంటాం'అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భార్య, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి అన్నారు. దువ్వాడ నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి చేపడుతున్న న్యాయపోరాట దీక్షను సోమవారం కూడా కొనసాగించారు. నా డబ్బులతోనే ఈ ఇల్లు నిర్మించారు.. దువ్వాడ నాకు ఎటువంటి ఆస్తులు ఇవ్వలేదు. నా సోదరి వద్ద డబ్బు అప్పుచేసి మరీ దువ్వాడకు ఇచ్చాను. నా ఇంటిని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుస్తారా? దువ్వాడ ఓ ఊబిలో చిక్కుకున్నారు.. ఫ్రెండ్‌షిప్ హౌస్ ఎక్కడైనా ఉంటుందా అని వాణి ప్రశ్నించారు. మాధురితో నాకు ఎటువంటి సంబంధం లేదు. మా జీవితంలోకి ఆవిడ వచ్చి తగాదాలు సృష్టించిందన్నారు. దువ్వాడ నివాసం వద్ద నాలుగోరోజు కూడా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దువ్వాడ వాణికి మద్దతుగా ఆమె తండ్రి రాఘవరావు, కుమార్తెలు హైందవి, నవీనలు కూడా సోమవారం హాజరయ్యారు. సోమవారం రాత్రి వాణి, ఆమె కుమార్తెలు అక్కడే పడుకున్నారు.

దువ్వాడ ఆడియో లీక్ కలకలం

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఐవోసీ అధికారులతో మాట్లాడిన ఆడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మాధురికి తలగాం వద్ద పెట్రోల్ బంకు ఉందని.. వాటి అడ్డంకులు తొలగించి వెంటనే బంకు ప్రారంభించి పోర్టు వాహనాలకు ఆయిల్ అక్కడి నుంచే సరఫరా చేయాలని దువ్వాడ ఐవోసీ అధికారులను కోరిన ఆడియో లీకవడం చర్చనీయాంశమైంది.

కారును ఢీకొన్న కేసులో దివ్వెల మాధురిపై కేసు నమోదు

పలాసరూరల్: లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన టెక్కలికి చెందిన దివ్వెల మాధురిపై కేసు నమోదు చేసినట్టు కాశీబుగ్గ ఎస్ఐ పారి నాయుడు తెలిపారు. టెక్కలి నుంచి వస్తున్న మాధురి తన కారుతో ఒడిశా రాష్ట్రానికి చెందిన సుంకర సుధాకర్, శైలజ కారును ఢీకొట్టడంతో వారు ఈ ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే. ఒడిశాకు చెందిన వారిరువురు ఈ ప్రాంతంలో ఓ పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదా నికి కారణం తానే అని మాధురి చెప్పడం చట్టరీత్యానేరమని, తన కారుతో మా వాహనాన్ని ఢీ కొట్టడంతో గాయాలకు గురయ్యామని, ప్రమాదంతో సరిపోయిందే గాని ప్రాణాలకు హాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇటు వంటి విషయంలో నేరం చేసిన వారిని శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సుంకర శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే వంతెన పనులు వేగవంతం చేయండి

జలుమూరు: తిలారు రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన పనులు వేగవంతం చేయాలని హైవే భాగం సీఈ వి.రామచంద్ర ఆదేశించారు. సోమవారం రైల్వే వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్ష్మీ నృసింహ దేవాలయం వద్ద రోడ్డు విస్త రణపై కోర్టులో కేసు ఉన్నందున వంతెన పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. అయితే సదరు కేసు స్థలాన్ని విడిచిపెట్టి మిగతా వంతెన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయ నతో పాటు హైవే ఎస్ఈ టి.సత్యనారాయణ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ కేవీఎల్ నరసింహరావు, జేఈ రఘు తదితరులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** స్థానిక రైల్వేలైన్ పైనుంచి చేపట్టిన ఫ్లైఓవర్ వంతెనపనులు వేగవంతం చేయాలని హైవే సీఈ వి.రామచంద్ర అన్నారు. పాతపట్నంలో జాతీయ రహదారి 326-ఎ విస్త రణ పనుల్లో భాగంగా జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల కారణంగా వాహన దారులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఈ టి.సత్యనారాయణ, ఈఈ శ్రీనివాసులు తదితరులున్నారు.

ఉపాధ్యాయ సర్దుబాటును వ్యతిరేకిస్తూ నిరసన

నందిగాం/మందస/టెక్కలి/ఎల్ఎన్‌పేట/నరసన్నపేట: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఐక్య ఉపాధ్యాయ సంఘాలు సోమవారం బహిష్కరించాయి. ఫ్యాప్టో, జాక్టో, పోర్టో పిలుపు మేరకు బహిష్కరిస్తున్నట్లు ఎంఈవోలకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలను అందించారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటుతో విద్యావ్యవస్థకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ ప్రక్రియలో సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధాలతో కూడుకొని ఉన్నందున వెంటనే వెనుక్కు తీసుకోవాలని, లేకుంటే పోరాటం చేస్తామన్నారు.

అంగవైకల్యం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కోటబొమ్మాళి: మానసిక, శారీరక వైకల్యం ఉన్న పిల్లలను ఓపిక, సహనంతో సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక భవిత కేంద్రంలో మానసిక, శారీరక వైకల్యం పిల్లలు, వారి సంరక్షకుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందక పోయిన న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తే ఉచితంగా వారికి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్. శ్రీనివాసులు, తిరుమలరావు, పల్లి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, ఎంఈవో ఎల్వీ ప్రతాప్, ఫిజియోథెరపిస్ట్ జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


చిన్నారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

జీడి కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు


జీడి కార్మిక సంఘ నేతలను సత్కరిస్తున్న టీడీపీ బీసీ సెల్ నేతలు

పలాస: జీడి కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక కార్మిక భవన్‌లో జీడి, రైస్‌మిల్లర్ల కార్మిక సంఘ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా జీడి కార్మిక సంఘానికి భారీ సంఖ్యలో సభ్యత్వం ఉందని, ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, టీడీపీ నాయకులు గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, కొత్త సత్యం, డొక్కరి శంకర్, బద్రి గోపాల్ పాల్గొన్నారు.

ఎంఎంఎస్ కార్యవర్గం

సంతబొమ్మాళి: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పంగ భానుమతి (చెట్లతాండ్ర), ఉపాధ్యక్షురాలిగా సీహెచ్ డిల్లేశ్వరి (మరువాడ), కార్యదర్శిగా డి.వేణమ్మ (సంతబొమ్మాళి), జాయింట్ సెక్రటరీగా బి.హేమలత (వడ్డితాండ్ర), కోశాధి కారిగా డి.విజయ లక్ష్మి (కొల్లిపాడు) ఎన్నికైనట్లు వెలుగు ఏపీఎం టి.సూర్యనారాయణ తెలిపారు. అనంతరం కొత్త కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

రక్తదానం చేసిన యువత

సంతబొమ్మాళి: భావనపాడులో ఆ నలుగురు ట్రస్ట్ అధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 53 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానంతో ప్రాణదాతలు అవుతారని ట్రస్ట్ సభ్యులు సానా ఈశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో టెంక తేజేశ్వరరావు, మన్మధ, హేమ చందర్, విఘ్నేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సమయం మార్చండి

టెక్కలి: టెక్కలిలో ఉదయం 6 గంటలకే తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ సోమవారం ఆర్డీవో బొమ్మాళి సుదర్శన్‌దొరకు బీజేపీ నాయకులు చిట్టిబాబు, జన్ని పరమేష్ వినతి పత్రం అంద జేశారు. ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు నీరు విడిచిపెట్టడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పలాస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. సీపీఐ నాయకుడు చాపర వేణుగోపాలరావు పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోరాటాల ద్వారే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విద్యార్థి సమస్య లపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూనే ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవి, పవన్, జశ్వంత్, రాహుల్, జీవన్, కుమార్ పాల్గొన్నారు.

పాత్రికేయుడు పీఏ పంతులు మృతి

టెక్కలి, ఆగస్టు 12: ఐదు దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ పాత్రికేయుడు పల్లమూడి అప్పయ్య పంతులు(82) సోమవారం అనా రోగ్యంతో స్వగృహంలో మృతి చెందారు. ఈయన ప్రధాన పత్రికలతో పాటు చిన్న పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా తొలి అధ్య క్షుడిగా, టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా, గౌరవాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పీఏ పంతులు మృతికి మంత్రి అచ్చెన్నాయుడు తన సంతాపం వ్యక్తం చేశారు. జర్నలిజానికి వన్నెతెచ్చిన వ్యక్తి అప్పయ్యపంతులని కొనియాడారు.


పీఏ పంతులు (ఫైల్)

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

కాశీబుగ్గ: కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితుల సహాయార్థం సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిధులను సేకరించారు. నిరాశ్రయులను ఆదుకోవడానికి ఈ నిధి సేకరణ చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి, రైతుసంఘం నాయకుడు టి.అజయ్‌కుమార్, ప్రసాదరావు, జ్యోతి, సునీత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

పలాస: ఉదయపురం వెంకటేశ్వర ఆలయంలో స్థానిక క్యాజూ ల్యాండ్ వనిత విభాగం ఆధ్వ ర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 315 మందికి పరీక్షలు నిర్వహించి మందు లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనిత విభాగం అధ్యక్షురాలు తర్లాన శ్వేతకుమారి, కార్యదర్శి మల్లా సంతోషి, కోశాధికారి తూముల శ్వేతకుమారి, మల్లా జయశ్రీ, టీడీపీ సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, పెంట మానస, శివాజి పాల్గొన్నారు.

సమాజంపై బాధ్యతగా మెలగాలి

కాశీబుగ్గ: యువత సమాజంపై బాధ్యతగా మెలగాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండు దొర అన్నారు. ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వారిలో శక్తిని సమాజ సేవకు వినియోగించాలని, లక్ష్య సాధనతో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుమలరావు, లయన్స్ క్లబ్ సభ్యులు కుమార్ నాయక్, తెప్పల కృష్ణమూర్తి, ఎస్.అప్పా రావు, వి.వెంకట్రావు పాల్గొన్నారు.

సంషేర్‌సింగ్ రావత్ పేరిట వ్యాసరచన పోటీలు

నందిగాం: సంషేర్‌సింగ్ రావత్ పేరిట సోమవారం మండలస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నందిగాం ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు 'సమాజ వికాసంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై పోటీలు ఎంఈవోలు జి.నర్శింహులు, ఎ.చిన్నారావు, హెచ్ఎం వై.హరిబాబు పర్యవేక్షణలో జరిగాయి.

గిరిజన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

● ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి

హరిపురం: ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతు న్నట్లు సీతంపేట ఐటీడీఏ పీవో రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. చీపి గ్రామంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా 138 మంది వివిధ సమస్యలపై వినతులు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్య ఉద్దేశమని, ప్రాధాన్యతాపరంగా పరిష్కరిస్తామన్నారు. మందసలో ఐటీడీఏ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, భూ సమస్యలు, సాగు, తాగు నీరు, కాలనీ ఇళ్ల తదితర సమస్యలపై వినతులను అందించారు.

విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆగ్రహం

చీపి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. పాఠ్యాంశాల బోధన తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లుగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుండడంతో హెచ్ఎం కె.సురేంద్రను ప్రశ్నించారు. 160 మంది విద్యార్థులకు గాను కేవలం 82 మంది మాత్రమే ఉండడాన్ని గుర్తించి విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం కుంటికోట వద్ద వైటీసీ కేంద్రాన్ని సందర్శించారు. గతంలో ఇక్కడ జరిగే శిక్షణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీడీ అప్పన్నదొర, ఎంపీడీవో ఎ.రఘుపతిరావు, డీటీ సంతోష్ పండా తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్ కుమార్ రెడ్డి

పంచాయతీలో తాగునీటి వసూలుకు తీర్మానం

నరసన్నపేట: ప్రభుత్వం ఇంటింటికీ అందిస్తున్న తాగునీటిపై పన్ను వసూలు చేసేందుకు పంచాయతీ సభ్యులు తీర్మానించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేశారని, వాటిని మెయింటినెన్స్‌కు పన్ను విధించాలన్నారు. బార్ ఏర్పాటుకు ఏవిధంగా అనుమతులిచ్చారో తెలపాలని వార్డు సభ్యులు కేజీహెచ్ గుప్త ప్రశ్నించగా.. ఏడాదిన్నర కిందట వైసీపీ హయాంలో బార్ ఏర్పాటుకు అనుమతిస్తే.. ఇప్పుడు ప్రశ్నించి ప్రస్తుత ప్రభుత్వంపై నెపం నెట్టడం ఎందుకని వార్డు సభ్యుడు గొలివి రామారావు ప్రశ్నించడంతో చిన్నపాటి వివాదం నెలకొంది. సర్పంచ్ బి.శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్డు సభ్యులు, ఈవో చిన్నారావుపాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

పలాసరూరల్: పలాస మండలం రామకృష్ణాపురం ఉజ్జుడిమెట్ట సమీపంలోని భూముల విషయంలో రైతులకు న్యాయం చేయాలని వామపక్ష రైతుసంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాధిత రైతులతో కలిసి ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ఎన్.గణపతి, చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు, కుత్తువ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో ఉజ్జుడిమెట్టకు ఆనుకొని ఉన్న భూములను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించారని, ఆందోళన ఉధృతం చేసి కాపాడుకున్న భూములకు పట్టాలివ్వాలన్నారు. దీనిపై ఆర్డీవో భరత్‌నాయక్ స్పందిస్తూ.. రైతుల వివరాలు, పట్టాలు, భూహక్కు పత్రాలను అందజేస్తే రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయ కులు గొరకల బాలకృష్ణ, దమయంతి, లక్ష్మమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

కొత్తూరు/కోటబొమ్మాళి/హరిపురం/నరసన్నపేట/టెక్కలి: డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఈబీ అధికారులు, ఉపాధ్యాయులు, అధికారులు కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలన చేయాలని కోరుతూ సోమవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా క్రమశిక్షణతో మెలగాలని వక్తలు కోరారు. నషాముక్త భారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. అలాగే పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మందస మండలం గంగ్రుగాం కూడలిలో సోమవారం ఎస్ఈబీ సీఐ జైభీమ్ ఆధ్వర్యంలో ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తుపదార్థాల నివారణకు ప్రభుత్వం కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వంశధార నదికి పంచహారతి


జలుమూరు: పవిత్ర వంశధార నదికి సోమవారం అర్చకులు పంచహారతి ఇచ్చి పూజలు చేశారు. దేవదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీవారం వంశధార నదికి హారతి అందించి పూజలు చేస్తున్నట్లు అర్చకుడు నారాయణమూర్తి తెలిపారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురానికి చెందిన తిమ్మల అప్పలస్వామి చిన్నవయసులోనే ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఉద్దాన హెల్పింగ్ సొసైటీ రూ.20 వేలు సాయం అందిం చింది. ఇద్దరు ఆడపిల్లలు కావడంతో వారి పేరున డిపాజిట్ చేసినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చంటి, గిరి, రూప జయరాం, మోహన్ పాల్గొన్నారు.

ఎస్ఐగా రఘునందనరావు

టెక్కలి: టెక్కలి ఎస్ఐగా రఘునందనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్ఐ లక్ష్మి వీఆర్‌కి వెళ్లారు.



ఎస్ఆర్ రంగనాథన్‌కు ఘన నివాళి


లైబ్రేరియన్‌లను సన్మానిస్తున్న నిర్వాహకులు

పాతపట్నం/టెక్కలి: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సంద ర్భంగా సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పాతపట్నం, టెక్కలిల్లో నిర్వహించారు. పాతపట్నం గ్రంథాలయంలో సంతబొమ్మాళి, హిరమండలం, మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, పలాస గ్రంథాలయాధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బూర్లె కుమార్‌రాజు, డెప్యూటీ లైబ్రేరియన్ వీజీఎస్ శంకరరావులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, చిన్నపిల్లల వైద్యనిపుణుడు జి.వేణు గోపాలరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● టెక్కలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. గ్రంథపాలకులు డి.రూపావతి, విశ్రాంత గ్రంథపాలకుడు టి.వైకుంఠరావు, ఉపాధ్యాయులు గున్న ప్రసాదరావు రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ దినోత్స వాన్ని నిర్వహించారు.

సనాతన ధర్మంపై ప్రచారం

హిరమండలం: హిందూ ధర్మ రక్షణ కోసం అందరూ ఒకటై నడవాలని సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ దొడ్ల సెంచులు అన్నారు. సోమవారం హిరమండలంలో హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలు, కుంకుమను భక్తులకు పంపిణీ చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

టెక్కలి: నౌపడా రైల్వేజంక్షన్ సమీపంలో సోమవారం ఓ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామం కస్పా వీధికి చెందిన మోనింగి మోహనరావు(56)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈయన ఈ ప్రాంతం నుంచి విశాఖ వైపు వెళ్తూ ప్రమాదవశాత్తు పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మోహనరావు వంటమాస్టర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరుతో మోసంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం: చదువుకునే రోజుల్లో ప్రేమపేరుతో వెంటపడి అవసరం తీర్చుకుని ఉద్యోగం వచ్చాక మరో మహిళతో వివాహానికి సిద్ధమై తనను మోసం చేశాడని ఓ సచివాలయ డిజిటల్ ఆపరేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఓ వీధిలో నివసిస్తున్న ఓ యువతి టెక్కలిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నప్పుడు తన క్లాస్‌మేట్ సోంపేట మండలం శారదాపురం గ్రామానికి చెందిన నారవ వివేక్ పరిచయమయ్యాడు. తనను ప్రేమిస్తున్నానంటూ వివేక్ వెంటపడేవాడని, ఈ క్రమంలో ఇద్దరం ప్రేమించుకున్నట్టు తెలిపారు. ప్రేమ పేరుతో అవసరం తీర్చుకున్న వివేక్.. తనకు కొన్ని బాధ్యతలున్నాయని, అప్పులు తీర్చాల్సి ఉందని ఆ సమస్యలు నుంచి బయటపడిన తర్వాత వివాహం చేసుకుందామని నమ్మించాడు. దీంతో వివేక్‌కు ఆర్థికంగా సహకరించింది. అయితే వివేక్‌కు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కందివలగెడ్డ గ్రామంలో సచివాలయ డిజిటల్ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇదే అదునుగా మరో మహిళతో వివాహం చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. ఆరు నెలల కిందట విషయం తెలుసుకున్న ఆ యువతి వన్‌టౌన్ పోలీసులకు వివేక్‌పై ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పెళ్లి చేసుకుంటానని ఒప్పుకున్నాడు. తొలుత మూడు నెలలు, మరోసారి రెండు నెలల గడువు తీసుకున్నాడు. ఇప్పుడు తాను పెళ్లి చేసుకోనంటూ ముఖం చాటేస్తున్నాడు. దీంతో ఆ యువతి వివేక్‌పై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కామేశ్వరరావు సోమవారం కేసు నమోదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఎచ్చెర్ల: నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను తమ్మినాయుడుపేట వద్ద సోమవారం పట్టుకున్నట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. బాధ్యులైన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

పొందూరు: తాడివలస పంచాయతీ లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి.రామారావుపై కొంతమంది గ్రామస్థులు డీఈవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. టి.తనీష అనే విద్యార్థిని విజయనగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నా లచ్చయ్యపేట పాఠశాలలో చదువుతున్నట్టు పేరును కొనసాగిస్తూ హాజరువేస్తూ మధ్యాహ్న భోజన పథకం నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని దీనిపై పూర్తి విచారణ జరిపించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగాల పేరుతో మోసపోయాం


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో వివిధ ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో ఉద్యోగాలిస్తామని చెప్పి రూ.1.80 కోట్లు ఇచ్చి మోసపోయామని పలువురు నిరుద్యోగులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అరసవిల్లి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన గొల్ల బెనర్జీ అలియాస్ హర్ష అనే వ్యక్తి ఎస్‌బీఐలో అకౌంటెంట్, క్లర్క్, పీవోలుగా ఉద్యోగాలిస్తామని రూ.26లక్షలు తీసుకున్నాడని బర్రి ఆదినారాయణ, గొండు అప్పన్న, కొండపల్లి బాబురావు, బరాటం అప్పన్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి మీకోసంలో ఫిర్యాదు చేశారు. అలాగే అరసవిల్లి పరిధిలో మరో 10 మంది నుంచి కూడా రెండేళ్ల కిందట ఉద్యోగాల పేరుతో వసూలు చేశాడని ఇలా అందరి నుంచి రూ1.80 కోట్లు కాజేసినట్టు బాధితులు వివరించారు. తమకు న్యాయం చేయాలని వారు ఎస్పీని కోరారు. కాగా మీ కోసంలో మొత్తం 50 వినతులు వచ్చాయి. కుటుంబ తగాదాలపై రెండు, చీటింగ్‌పై ఒకటి, పాత కేసులపై 11, పౌర సంబంధాలపై12, ఇతర తగాదాలపై 24 ఫిర్యాదులు వచ్చాయి. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శ

జి.సిగడాం: బాతువ గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు కూనుబిల్లి కూర్మారావు సోదరుడి కుమారుడు రాంబాబు మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకొన్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) సోమవారం పరామర్శించారు. కూటమి నాయకులు కుమారాపు రవికుమార్, ముప్పిడి సురేష్, నక్క మురళీ, భూపతి శ్రీరామూర్తి, డబ్బాడ ఆదినారాయణ, ఎం.నారాయణరావు, బి.అప్పలనాయుడు, సీఐ మధుసూధనావు తదితరులు ఉన్నారు.

బంగ్లాదేశ్‌లోని హిందువులకు రక్షణ కల్పించాలి


కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న దృశ్యం

రణస్థలం: బంగ్లాదేశ్‌లోని హిందువులకు రక్షణ కల్పించే చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

గ్రంథాలయాలు హృదయాల్లాంటివి

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలు హృదయంలాంటివని కాకినాడ ఆదిత్య కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి అన్నారు. స్థానిక కాకినాడ ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో సోమవారం నేషనల్ లైబ్రేరియన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కమల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీవో మజ్జి శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనాథకు సత్యసాయి ప్రతినిధుల సపర్యలు


సపర్యలు చేస్తున్న దృశ్యం

పొందూరు: మండల కేంద్రం పొందూరులో మతిస్థిమితం లేని ఓ అనాథకు సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు సపర్యలు చేశారు. భార్య మృతి చెందడంతో మతిస్థిమితం కోల్పోవడంతో రెండేళ్ల స్నానం లేకుండా సూర్యస్వామి వీధిలో ఉన్న దుకాణం అరుగే నివాసంగా ఉంటున్నాడు. ఎవరైనా భోజనం పెడితే తినడం లేకుంటే పస్తు లుండడమే. విషయం తెలుసుకున్న సత్యసాయి సేవా సంస్థ సేవకులు గుడ్ల సాయి రాజ్, ఎం.సాయిప్రశాంత్, బి.శ్రావణ్‌కుమార్ జుత్తు గెడ్డం కత్తిరించి స్నానం చేయించి భోజనం పెట్టారు. ప్రతీరోజు మూడు పూటల భోజన అందిస్తామని తెలిపారు.

117 జీవో రద్దు చేసి.. పని సర్దుబాటు చేయాలి

ఆమదాలవలస: జీవో 117ను రద్దు చేసి పని సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ ఉమ్మడి వేదిక సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల రిసోర్స్ సెంటర్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, డీటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ, టీఎన్‌యూఎస్ జిల్లా మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేసి సర్దుబాటు చేయాలని, అంతకు ముందు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు పి.కృష్ణారావు, బి.మహేష్, టీవీటీ భాస్కరరావు, పి.రమణ, పి.చంద్రశేఖర్, జి.చిన్న బాబు, సీహెచ్ సంతోష్‌కుమార్, పి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొరగాంలో జ్వరాల పంజా

- ఇంటింటా బాధితులే..
- ప్రైవేట్ వైద్యులను సంప్రదిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో గ్రామస్థులు


జ్వరంతో బాధపడుతున్న రాజారావు


రాజులమ్మ, దాలమ్మ, బుచ్చెమ్మ జ్వరంతో బాధపడుతున్న దృశ్యం

బూర్జ: కొరగాం గ్రామంలో గత వారం రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు మంచం పట్టారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో కొందరు శ్రీకాకుళం, ఆమదాలవలస, పాలకొండల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ఉన్నవారు ఆర్ఎంపీలతో నెట్టుకొస్తున్నారు. వారం రోజులుగా ప్రతి ఇంట్లోనూ విష జ్వరాలు, మోకాళ్లు, ఒంటి నొప్పులతో బాధపడుతున్నా వైద్యులకు పట్టకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామంలో పరిస్థితిని వివరించినా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా ఏఎన్ఎంలతో చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 600 మంది జనాభా ఉండగా సగం మంది వరకు జ్వరాలు, మోకాళ్లు, ఒంటి నొప్పులతో మూలుగుతున్నారు. గ్రామానికి అవసరమైన తాగునీరంతా ఒకే బోరు నుంచి తెచ్చుకుంటున్నారు. నీరు కలుషితం కావడం వల్లే గ్రామంలో సగం మందివరకు మంచం పట్టినట్టు భావిస్తున్నారు. దీనికి తోడు కాలువలు మురుగుతో నిండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలో తోటాడ బుచ్చెమ్మ, రాజులమ్మ, దాలమ్మ, ఈశ్వరమ్మ, వసంత, రాజారావుతో పాటు పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పాపారావు అనే వ్యక్తి తీవ్ర జ్వరంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గ్రామానికి కూతవేటు దూరంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అక్కులపేట) ఉన్నా వీరికి వైద్యం అందకపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, తాగునీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రక్త పరీక్షలు చేస్తున్నాం

గత మూడు రోజులుగా కొరగాం గ్రామంలో ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నట్టు ఏఎన్ఎం ధనలక్ష్మి తెలిపారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా జ్వరాలు ఉన్నాయని, మలేరియా, డెంగ్యూ వంటి లక్షణాలు ఎవరికీ లేవన్నారు. మరో మూడు రోజుల పాటు గ్రామంలో ఇంటింటా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

మెట్టవలసను సందర్శించిన ఎంపీ కలిశెట్టి


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం: మెట్టవలస గ్రామాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం పర్యటించారు. గ్రామంలో డయేరియా బారిన పడిన బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. డయేరియా బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించారు. డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్యసేవలు అందించాలన్నారు. సర్పంచ్ కామోజుల అరుద్ర, బెవర లక్ష్మి, కూటమి నాయకులు కుమారాపు రవికుమార్, కామోజులు సీతారాం, బెవర జగన్నాథరావు, గొలివి శ్రీనివాసరావు, బోగాది అప్పలనాయుడు, ఎంపీడీవో కె.వెంకన్నబాబు, ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు, వైద్యాధికారి యశ్వంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీకూర్మ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తా


ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార: ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ఉదయం పార్టీ నాయకులతో కలిసి శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే శంకర్ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కైబాడి రాజు, టీడీపీ నాయకులు షైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, వీఎస్ గిరి, కోరాడ వెంకటరావు, బూసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆశ కార్యకర్తలు

కవిటి: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రాన్ని అందించారు. రామయ్య పుట్టుగలో సోమవారం ఆశ కార్యకర్తలు కలిసి సమస్య లను వివరించారు. ప్రభుత్వంతో గతంలో కుదిరిన ఒప్పం దాల మేరకు జీవోలను విడుదల చేయాలని కోరారు. పనిభారంతో సతమతమవుతున్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాలను తీసుకువెళతానని ఎమ్మెల్యే తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపివేయాలి

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధంగా తలపెట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావులకు వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. సభ్యులు బి.గౌరీశ్వరరావు, వైవీ రమణ, కె.రమేష్, కేవీ శ్రీరాము, టార్జన్ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

కలెక్టరేట్: హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో 'మీకు తెలుసా' పేరిట రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. రెండు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డీఎంహెచ్‌వో బి.మీనాక్షి మాట్లాడుతూ.. ప్రజల్లో హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించడం, సురక్షిత పద్ధతులు పాటించడం, హెచ్ఐవీ బాధితులపై వివక్షత తగ్గించడం వంటి విషయాలపై కార్యక్రమాల్ని నిర్వహిస్తామన్నారు. ప్రతీ వారం ఒక్కో నినాదంతో అవగాహన కల్పిస్తామన్నారు.

రేషన్ డీలర్ల కార్యవర్గం

కంచిలి: మండలంలోని రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ గౌరవ అధ్యక్షుడు సాహుకారి బైరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు అధ్యక్షుడిగా కొత్తకోట నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పండి ప్రసాద్, కోశాధికారిగా బేసి శాంతి, ప్రధాన కార్యదర్శిగా డొప్ప నరేష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా సానా వెంకటరావు ఎన్నుకున్నట్టు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులు తహసీల్దార్ వై.జయలక్ష్మి, సీఎస్‌డీటీ కూర్మారావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

సరుబుజ్జిలి: అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు డీఎల్‌పీవో గోపిబాల తెలిపారు. డెంగ్యూ జ్వరాలతో బాధపడుతున్న సుబ్బపేట గ్రామాన్ని సోమవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో బాధ్యతగా ఉండాలన్నారు. ఈవోపీఆర్డీ ఆనందబాబు ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. కార్యదర్శి ఊర్వశి, ఆరోగ్యశాఖ గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి సీదిరి భూ ఆక్రమణ

- 'మీ కోసం'లో కలెక్టర్‌కు ఫిర్యాదు


న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

కలెక్టరేట్/మందస: మందసలో నివాసం ఉంటున్న మువ్వ వైద్యనాథం నకు చెందిన సుమారు 200 ఎకరాల భూమిని గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన సీదిరి అప్పలరాజు, కొంతమందితో కలిసి ఆక్రమించుకుని జగనన్న కాలనీ పేరుతో పంచి పెట్టారని, ఆ భూమిని మళ్లీ ఇప్పించాలని కోరుతూ వాసుదేవరావు ఆధ్వర్యంలో పలువురు బాధితులు సోమవారం మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక తహసీల్దార్ పాపారావు, సర్వేయర్ మోహనరావు, సెక్రటరీ శైలజ, జూనియర్ సెక్రటరీ మౌళి మమ్మల్ని భయపెడుతున్నారని తెలిపారు. అందులో జీడిపప్పు ఫ్యాక్టరీని మంత్రి అండదండలతో నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వే చేసి మాకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

విపత్తు అనంతరం అధ్యయనం చేయాలి

ఎచ్చెర్ల: భూ కంపాలు, అటవీ అగ్ని ప్రమాదాలు, పెనుతుఫాన్లు వంటి విపత్తులు సంభవించిన అనంతర పరిస్థితులపై అధ్యయనం చేయాలని థాంప్సన్ రివర్స్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్, హ్యూమన్ సర్వీసు అధ్యాపకుడు బాల నిక్కు (కెనడా) అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో సోమవారం రీసెర్చ్ ఫారం నిర్వహించిన సమావేశంలో విపత్తులు- స్థితి స్థాపకత భవిష్యత్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. విపత్తుల అనంతరం ప్రజల స్థితిగతులు, జీవరాశుల ఉనికి, మౌలిక వసతులు తదితర అంశాలపై పూర్తిగా దృష్టి సారించి అధ్యయనాలు చేస్తే రాబోయే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, కార్యక్రమ నిర్వాహకులు జేఎల్ సంధ్యారాణి, జి.రామకృష్ణ, ఎల్.విజయకుమార్, పి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆదివాసీల భూముల జోలికి వస్తే సహించం



ర్యాలీగా వెళ్తున్న ఆదివాసీలు

కలెక్టరేట్: మాకివలసలో గల ఆదివాసీల భూముల జోలికి వస్తే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తెలిపారు. పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ నుంచి జడ్పీ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ఆదివాసీలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యోగి మాట్లాడుతూ.. మాకివలస ఆదివాసీల నుంచి ఊణ్ణ సత్యనారాయణ అక్రమంగా దోచుకున్న 104 ఎకరాల 46 సెంట్లు భూమి, కూర్మ గ్రామ స్వామీల భూ ఆక్రమణలపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకే ఈ భూమి చెందేటట్టు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, జమ్మయ్య, భాస్కర్, సవర వెంకటేష్, ఎస్టీ మాకివలస గ్రామ పెద్దలు ఉత్తరయ్య, పాపారావు, ప్రసాద్, భాగ్య ఆదెమ్మ, సూరపనాయుడు, కళ్యాణి, హరీష్, మహిళలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు మరిచారు

గార: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం మర్చిపోయిందని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఎంఈవో నక్క రామకృష్ణను కలిసి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పని సర్దుబాటును బహిష్కరిస్తూ నోటీసు ఇవ్వడం జరిగింది. 117 జీవోతో పని సర్దుబాటు చేయడం విద్యారంగాన్ని నాశనం చేయడమే అవుతుందని ఈ విషయాన్ని స్వయంగా మంత్రి లోకేష్ గతం యువగళం పాదయాత్రలో చెప్పారని గుర్తు చేశారు. ఏపీటీఎఫ్(1938) ప్రతినిధులు గోవిందరావు అర్జునరావు, యూటీఎఫ్ నుంచి కె.సురేష్ కుమార్, ఎల్.బాబ్జీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

యువతే దేశానికి వెన్నెముక

అరసవల్లి: యువతే దేశానికి వెన్నెముక అని, యువశక్తి ఎంతో గొప్పదని, ఉన్నత భవిష్యత్తు కోసం యువత కలలు కని, వాటిని నిజం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. యువతకు ఉపాధి కల్పించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో..

శ్రీకాకుళం కల్చరల్: జామియా మసీదులో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో గులాబీ మొక్కలు నాటారు. మసీదు అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు హాజీ భయ్యా, సెక్రటరీ అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ సుకూర్ ఖాన్ సభ్యులు ఇర్ఫాన్ బాషా, సయ్యద్ షఫీ, మొతాబ్ ఖాన్, శైలాని బషీర్, జగన్, దిల్లు బాయ్, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు షాన్ రోషన్ బాషా, బాషా ఖాన్ తాజ్ మదీనా నిజాముద్దీన్, బహదూర్ బాషా, రఫీ పాల్గొన్నారు. మసీదు చుట్టూ ఉన్న ప్రహరీ మరమ్మతులు చేసి, ఎత్తు పెంచేందుకు సహకరిస్తానన్నారు.

వైద్యులపై దాడులను ఆపాలి



దాడులు ఆపాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: వైద్యులపై దాడులను ఆపాలని కోరుతూ శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్) వైద్యులు, సిబ్బంది సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై ఇటీవల హత్యాచారానికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతురాలికి శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు మండల సమావేశం

లావేరు: స్థానిక మండల పరిషరిత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ లుట్టు అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు జడ్పీటీసీ హారు కావాలని కోరారు.

ఉపాధ్యాయులను నియమించాలి

సోంపేట: బైలింగ్ పాఠశాలల్లో మీడియం వారీగా ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బృందావన దొళాయి కోరారు. ఒడియా మీడియం పాఠశాలల్లో తొలగించిన స్కూల్ అసిస్టెంట్ ఒడియా, తెలుగు లాంగ్వేజ్ పండిట్లను నియమించాలని కోరారు.

- **పొందూరు:** ప్రభుత్వం ఉపాధ్యాయుల వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ రద్దుచేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. జీవో నంబరు 117 రద్దు, వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ రద్దుకోసం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో-1,2 రామరాజు, పి.రాజారావులకు వినతిపత్రం అందించారు. సంఘ నేతలు ఎం.రమణరావు, జి.భాస్కరరావు, ఎస్.ఉపేంద్రబాబు, పి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు..
- **ఎచ్చెర్ల:** ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ఆటంకంగా నిలిచిన జీవో నెంబరు 117ను తక్షణమే రద్దుచేయాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఎంఆర్సీ వద్ద సోమవారం జరగాల్సిన ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమాన్ని బహిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు బలివాడ ధనుంజయరావు, బల్లెడ రవి, పైడి శ్రీరామ్మూర్తి, గొంటి సురేష్, కె.మురళీధరరావు, గొర్లె విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు. ఎంఈవోలు కె.పున్నయ్య, జి.రాజ్‌కిశోర్‌లకు వినతిపత్రాన్ని సమర్పించారు.
- **ఇచ్ఛాపురం:** ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంటును వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ప్రతినిధులు ఎంఈవో కె.అప్పారావుకు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి.శ్రీనివాస సాహు, పి.శంకర్, బి.శంకరరావు, సత్యమయ్య, అరుణ్ కుమార్, సంతోష్ కుమార్, జి.మాధవరావు, సాయి, సైనీరాజు పాల్గొన్నారు.
- **సోంపేట:** అసంబద్ధమైన 117జీవోను రద్దుచేసి ఎస్జీటీలకు పదోన్నతలు కల్పించిన తర్వాతే సర్దుబాటు చేయాలని మండల ఉపాధ్యాయ ఐక్యవేదిక ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేకు ఎంఈవో ఎస్.జోరాడుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. బీటీఏ, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ సంఘాల ప్రతినిధులు నగిరి మోహనరావు, బి.ఈశ్వరరావు, ఎస్.కూర్మారావు, వై.దాలిబందు ఉన్నారు.

కుసుంపురానికి నీటిని అందించండి

కవిటి: కుసుంపురం గ్రామానికి ఉద్దానం మంచినీటి పథకం నుంచి నీటిని అందించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. గత ఐదు రోజులుగా నీటి సరఫరాను నిలుపుదల చేసిఉన్నారని దానితో గ్రామస్థులు తీవ్ర నీటి ఇబ్బందిపడుతున్నారని మాజీ ఎంపీటీసీ ఎస్.పద్మ, సురేష్, గున్నయ్య తెలిపారు. తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటిని అందించాలని వారు కోరారు.

నకిలీ సర్టిఫికెట్ల మంజూరు ఆపాలి

అరసవల్లి: నగరంలోని రిమ్స్ సదరంలో బాధితుల నుంచి వసూలు చేస్తూ నకిలీ దివ్యాంగ ధ్రువ పత్రాలు మంజూరు చేస్తున్నారని, ఈ అక్రమాన్ని వెంటనే ఆపాలని టీడీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు గురుబెల్లి రమణమూర్తి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో తొమ్మిది మంది నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారన్నారు. వారి పేర్లు, ఐడీలను కూడా కలెక్టర్‌కు తెలియపరచినట్లు తెలిపారు. వెంటనే ఈ విషయంపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కవిటి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కవిటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం విద్యార్థులు, మండల అధికారులు ప్రతిజ్ఞ చేశారు. శ్రీకాకుళం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

- **ఇచ్ఛాపురం:** నషాముక్త భారతే లక్ష్యమని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.
- **కంచిలి:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాల పరిసరాలలో మొక్కలు నాటారు. సిబ్బంది హరిప్రసాద్, నవ్యశ్రీ, వేణుగోపాల్, దాసు, ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరువురూ సమానమే

కలెక్టరేట్: సమాజంలో ఆడ, మగ అనే తేడా ఉండరాదని, బాల బాలికలు ఇరువురూ సమానమేనని ఆర్డీవో సీహెచ్ రంగయ్య అన్నారు. సోమవారం తన చాంబర్‌లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టం అమలుపై సబ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో డేటాను అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏడీఎం హెచ్‌వో టి.శ్రీకాంత్, డాక్టర్ విద్యాసాగర్, గైనకాలజిస్టు స్వర్ణలత, డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ సుజాత, డీపీఆర్‌వో బాలమాన్‌సింగ్, డీపీఎం సురేష్‌కుమార్, స్వీప్ రమణమూర్తి, కోఆర్డినేటర్ సూర్యకళ పాల్గొన్నారు.

వర్షం కోసం గంగాభిషేకం

లావేరు: మండల కేంద్రం లావేరులోని చంద్రశేఖర ఆలయం వద్ద వర్షం కోసం గంగాభిషేకం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజలు స్థానిక పురోహితుడు నేతేటి బాలకృష్ణ ఆధ్వర్యర్యంలో 1100 బిందెల నీరు, 111 కొబ్బరి బొండాలతో గంగాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లంకలపల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు శిక్ష

పొందూరు: మైనర్లు డ్రైవింగ్‌చేస్తూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు శిక్షను ఎదుర్కోవలసి ఉంటుందని ఆముదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ వలనే జరుగుతున్నాయన్నారు. ఎవరైనా ఉద్యోగాలు వేయిస్తామంటూ డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తే అటువంటివారిని నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

లావేరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో సోమవారం డాక్టర్ ఎస్ఐఆర్ రంగనాథ్ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళలర్పించారు సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాచరసన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.